క్లుప్తంగా

కార్పొరేషన్‌లో పనిచేయని లిఫ్ట్



నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో లిఫ్ట్ పనిచేయడం లేదు. కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే కార్పొరేటర్లు, వృద్ధులు, దివ్యాంగులు పడుతున్న ఇబ్బందులు గమనించి గతంలో ఇక్కడ పనిచేసిన కమిషనర్ కీర్తి చేకూరి లిఫ్ట్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. దీని నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో రెండు రోజుల నుంచి కార్పొరేషన్‌కు వచ్చే కార్పొరేటర్లు, వృద్ధులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లిఫ్ట్ నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

రేపు సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ ఆపరేటర్లతో సమావేశం

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని సెప్టిక్ ట్యాంక్ క్లీన్ ఆపరేటర్లు, యజమానులతో శనివారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు జరిగే ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెప్టిక్ వ్యర్థాల తరలింపు, నిర్వహణ అంశాలపై అవగాహన సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. నగరంలోని ప్రతి సెప్టిక్ ట్యాంకర్ యజమాని తప్పనిసరిగా సమావేశానికి హాజరై, వ్యర్థాల నిర్వహణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాలను తెలుసుకోవాలని కోరారు.

నేడు స్ట్రోక్‌పై ప్రత్యేక కార్యక్రమం

గుంటూరు మెడికల్: రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ సహకారంతో గుంటూరులో స్ట్రోక్‌పై శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా, స్ట్రోక్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ పమిడి ముక్కల విజయ, సెక్రటరీ డాక్టర్ అరవింద్ శర్మ గౌరవ అతిథులుగా విచ్చేస్తున్నట్లు రొటేరియన్, ప్రాజెక్టు కో ఆర్డినేటర్ పి.వి.సత్యనారాయణ తెలిపారు. గుంటూరులోని భారతీయ విద్యా భవన్‌లో ఉదయం 8.30 గంటలకు చెక్ బీపీ – స్టాప్ స్ట్రోక్ అనే నినాదంతో కార్యక్రమం జరుగుతోందని, రోటరీ క్లబ్ సభ్యులు అధిక సంఖ్యలో కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాద దాడి అమానుషం

ఎల్ఐసీ ఉద్యోగుల యూనియన్ కార్యదర్శి రాజేంద్రప్రసాద్



కొరిటెపాడు(గుంటూరు): ఉనికి కోసం అమాయక పర్యాటకులను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులను తుద ముట్టించాలని, ఉగ్రవాదుల చేతిలో అసువులు బాసిన పర్యాటకుల ఆత్మలకు శాంతి చేకూర్చాలని ఎల్ఐసీ ఉద్యోగుల యూనియన్ కార్యదర్శి జే.రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దురాగతాన్ని ఖండిస్తూ అరండల్‌పేటలోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద గురువారం సాయంత్రం ఉద్యోగులు, సిబ్బంది ప్లకార్డులు పట్టుకొని నిరసన కార్యక్రమం చేపట్టారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కాశ్మీరులో ప్రశాంతత నెలకొన్నదని ప్రజలు భావిస్తున్న సమయంలో అనేక మంది అమాయక పౌరులను అత్యంత కిరాతకంగా కాల్చి చంపడం దారుణమన్నారు. భద్రతా సౌకర్యాలను మరింత మెరుగు పరిచి, రక్షణ వ్యవస్థను పటిష్టం చేయాలని సూచించారు. పౌరుల మృతికి సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఎల్ఐసీ అధికారులు ఆర్వీ సుబ్బారావు, జి.కిషోర్, సురేష్, విజయ రాఘవ, ఉమామహేశ్వరరావు, శ్రీదేవి, సుమ, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

మేయర్ పదవికి వైఎస్సార్ సీపీ పోటీ

- త్వరలో అభ్యర్థి ఎంపిక
- కార్పొరేటర్‌లతో వైఎస్సార్ సీపీ నేతల సమావేశంలో నిర్ణయం
- 28న జరగనున్న మేయర్ ఎన్నికపై చర్చ



మాట్లాడుతున్న అంబటి రాంబాబు, పక్కన మోదుగుల వేణుగోపాలరెడ్డి, అప్పిరెడ్డి, వజ్రబాబు

పట్నంబజారు: గుంటూరు నగర పాలక సంస్థ మేయర్ పదవికి అభ్యర్థిని పోటీలో పెట్టాలని వైఎస్సార్ సీపీ నిర్ణయించింది. త్వరలో అభ్యర్థిని ఎంపిక చేస్తామని ఆ పార్టీ నాయకులు తెలిపారు. మేయర్ పదవికి కావటి మనోహర్‌నాయుడు రాజీనామా చేసిన విషయం విదితమే. మేయర్ ఎన్నిక కోసం రాష్ట్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిన నేపథ్యంలో ఈనెల 28వ తేదీన ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు కార్పొరేటర్‌లతో గురువారం భేటీ అయ్యారు. బృందావన్‌గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, గుంటూరు, పల్నాడు జిల్లాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, నగర డిప్యూటీ మేయర్, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు కార్పొరేటర్‌లతో పలు అంశాలపై చర్చించారు. 28వ తేదీన జరిగే నగర మేయర్ ఎన్నికల్లో పోటీకీ అభ్యర్థిని పెట్టాలని సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించారు. మేయర్ అభ్యర్థి అంశాన్ని రాజ్యసభ సభ్యులు, పార్టీ గుంటూరు, కృష్ణా జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిలతో సంప్రదించిన తరువాత వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రకటించటం జరుగుతుందని పార్టీ నేతలు తెలిపారు. త్వరలోనే అభ్యర్థిని ప్రకటించటం జరుగుతుందన్నారు.

తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలి

- నగర కమిషనర్ పులి శ్రీనివాసులు
- నగరంలో విస్తృతంగా పర్యటన
- తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య పనుల పరిశీలన



అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

నెహ్రూనగర్: వేసవి దృష్ట్యా తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని, వార్డుల వారీగా డీఈఈలు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. కమిషనర్ శ్రీనివాసులు గురువారం మద్దిరాల కాలనీ, బసవతారకనగర్, ఆర్టీసీ కాలనీ ప్రాంతాల్లో పర్యటించి తాగునీటి సరఫరా, అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో తాగునీటి సరఫరాపై ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని, వార్డుల వారీగా పైప్‌లైన్ మరమ్మతులకు సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లోనే అనుమతులు ఇచ్చినందున స్థానిక ఏఈలు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మద్దిరాల కాలనీలో సమగ్రంగా తాగునీటి సరఫరా జరిగేలా వారం రోజుల్లో డిస్ట్రిబ్యూషన్ పైప్ లైన్లపై వాల్వ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. కాలనీలోని అంతర్గత డ్రెయిన్లలో పూడిక తీయడంలేదని ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని, సిల్ట్ కార్మికుల ద్వారా 2 రోజుల్లో పూడిక తీయించాలని ప్రజారోగ్య కార్మికులను, ఔట్ ఫాల్ డ్రెయిన్‌పై ఆక్రమణలను తొలగించాలని పట్టణ ప్రణాళిక కార్యదర్శులను ఆదేశించారు. ఆర్టీసీ కాలనీలో పలు అభివృద్ధి పనులను పరిశీలించి, పనులను నిర్దేశిత గడువు మేరకు పూర్తి చేసేలా ఇంజినీరింగ్ అధికారులు చొరవ చూపాలని, లేకుంటే పనుల జాప్యం వలన ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. అనంతరం సుద్దపల్లి డొంకలోని జీఎంసీ ఫీకల్ స్లెడ్జ్ ట్రీట్మెంట్ ప్లాంట్ ని పరిశీలించి ప్లాంట్ రన్నింగ్‌కు అవసరమైన చర్యలు తీసుకోవాలని, ట్రీట్మెంట్ జరిగిన అనంతరం వచ్చే నీటి నిల్వకు స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటు చేయాలనీ ఈఈని ఆదేశించారు. పర్యటనలో ఈఈ సుందరరామిరెడ్డి, డీఈఈ నాగభూషణం, ఎస్ఎస్ ఐజాక్, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

పక్షులు, జంతువులకు తాగునీటిని అందించేందుకు ముందుకు రావాలి

ప్రస్తుత వేసవిలో పక్షులు, జంతువులకు తాగునీటిని అందించడానికి నగర ప్రజలు ముందుకు రావాలని, వారి ఇళ్లు, ఇంటి ముందు వాటి కోసం నీటిని అందుబాటులో ఉంచడం ద్వారా వాటి దాహార్తిని తీర్చవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో కోరారు. వేసవి వడగాల్పులు, ఎండ తీవ్రత వలన పక్షులు, ఇంటి ముందు ఉండే జంతువులు దాహంతో ఇబ్బంది పడుతుంటాయన్నారు. నగర ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో, రోడ్ల పక్కన నీడ ఉండే ప్రాంతంలో నీటిని జంతువులకు తొట్టెల్లో, పక్షులకు చిన్న గిన్నెలలో అందుబాటులో ఉంచడం ద్వారా వాటి దాహాన్ని తీర్చినవారవుతారన్నారు.

రూ.91.50 లక్షల పన్ను చెల్లించిన పోలిశెట్టి గ్రూప్స్

నెహ్రూనగర్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025–26) సంబంధించిన ఆస్తి పన్నును ముందస్తుగా ఏప్రిల్ నెలాఖరులోపు ఏక మొత్తంగా చెల్లించే వారికి పన్నుపై 5 శాతం రాయితీ లభిస్తుందని ప్రకటించిన నేపథ్యంలో పోలిశెట్టి సోమసుందరం గ్రూప్ ఆఫ్ కంపెనీస్ రాయితీని సద్వినియోగం చేసుకొని రూ.91.50 లక్షలు పన్ను చెల్లించినట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. గురువారం కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో పోలిశెట్టి సోమసుందరం గ్రూప్ ఆఫ్ కంపెనీస్ హెచ్ఆర్ మేనేజర్ రాఘవేంద్రరావు ముందస్తు పన్ను చెల్లిస్తూ కమిషనర్‌కి చెక్కులు అందించారు. ఆస్తి పన్నును ముందస్తుగా ఏక మొత్తంగా చెల్లించే వారికి 5 శాతం రాయితీ అవకాశాన్ని కల్పించిందని, ఈ నెల 30లోపు ఆస్తి పన్నుని ఏక మొత్తంగా చెల్లిస్తే పన్ను రాయితీ లభిస్తుందని తెలిపారు. పోలిశెట్టి సోమసుందరం గ్రూప్ ఆఫ్ కంపెనీస్ తమ సంస్థలకు సంబంధించి 40 అసెస్మెంట్‌లకు ముందస్తు పన్ను చెల్లించడం ద్వారా రూ.5 లక్షల వరకు పన్ను రాయితీని పొందారనన్నారు. ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిలను ఒకేసారి ఏక మొత్తంగా చెల్లిస్తే వారికి వడ్డీపై 50 శాతం రాయితీని కూడా ఈ నెలాఖరులోపు చెల్లించి పొందవచ్చని తెలిపారు. నగరంలోని ఆస్తి, ఖాళీ స్థల పన్నుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రాయితీ పొందాలని కోరారు.

తవ్వారు...వదిలేశారు.

రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు



నగరంపాలెం: స్థానిక నెహ్రూనగర్ వాటర్ ట్యాంక్ ఎదురు రోడ్డు అధ్వానంగా మారింది. భూగర్భ డ్రైనేజీ పనుల నిమిత్తం గతంలో పనులు చేపట్టారు. పనులు ముగిసిన రహదారి మధ్యలో గుంతలను సీసీ రహదారిగా నిర్మించలేదు. దీంతో నెహ్రూనగర్ రైల్వే గేట్, సంజీవయ్యనగర్ రైల్వేగేట్, వెంకటాద్రిపేట వైపు వెళ్లే వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. రహదారి సగానికి పైగా అధ్వానంగా ఉండటంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నామని స్థానికులు తెలిపారు. ఉదయం, సాయంత్రం వేళల్లో జనసంచారంతో మరింత రద్దీగా ఉండటంతో మరింత కష్టంగా ఉంటుందని వాపోయారు. ఇప్పటికైనా జీఎంసీ అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

దోమల నియంత్రణకు జాగ్రత్తలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కొర్రా విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తన చాంబర్‌లో వైద్యాధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మలేరియా నియంత్రణలో భాగంగా ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పరిశుభ్రపరచుకోవాలని తెలిపారు. ప్రతీ శుక్రవారం డ్రై డేగా పాటించాలన్నారు. హాస్టల్, స్కూల్స్‌లో డోర్లకు మెష్‌లు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. గనుల ప్రాంతాల్లో, క్వారీల్లో, నిలువ నీటిలో మలేరియా ఆయిల్ బాల్స్‌ని ఉపయోగించుకోవాలని సూచించారు. సాయంత్రం సమయంలో దోమలు ఇళ్లలోకి రాకుండా తలుపులు, కిటికీలు మూసివేయాలని తెలిపారు. ఒంటినిండా కప్పివుండే దుస్తులు ధరించి, ప్రతి ఒక్కరూ తప్పకుండా దోమతెరలు వాడాలని సూచించారు. అందరు పరస్పర సహకారంతో దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల్ని నివారించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ ఎ.శ్రావణ్ బాబు, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ రోహిణి రత్నశ్రీ, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్. రవి బాబు, జిల్లా పంచాయతీ ఆఫీసు, జిల్లా విద్యాశాఖ, జిల్లా మత్స్య శాఖ, గనుల శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

జెడ్పీలో పంచాయతీరాజ్ దినోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: జెడ్పీ సమావేశ మందిరంలో గురువారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని జరుపుకున్నారు. జెడ్పీ అకౌంట్స్ అధికారి పి.శామ్యూల్‌పాల్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ 1957లో బల్వంతరాయ్ మెహతా సిఫార్సుల మేరకు మూడంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థ ఏర్పడిందని తెలిపారు. బల్వంతరాయ్ మెహతా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉద్యోగులు శివన్నారాయణ, రాజా రత్నబాబు, కూచిపూడి మోహన్, తోట ఉషాదేవి తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 120 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన వారితో కళాశాల యాజమాన్యం

గుంటూరు ఎడ్యుకేషన్: సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య–కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాలలో గురవారం మ్యాజిక్‌బస్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన జాబ్‌మేళాలో 120 మంది అభ్యర్థులు వివిధ సంస్థల్లో ఉద్యోగాలు పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు తెలిపారు. 16 కంపెనీలు పాల్గొన్న జాబ్‌మేళాలో 300 మంది నిరుద్యోగ యువత నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. ఇంటర్వ్యూలు నిర్వహించిన ఆయా సంస్థల ప్రతినిధులు 120 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసి, జాబ్ ఆఫర్ లెటర్లు అందజేశారని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు పచ్చిపులుసు రాఘవరావు, కార్యదర్శి కర్పూరపు సూర్యనారాయణ, బాపూజీ కమిటీ విద్యాసంస్థల కార్యదర్శి కర్పూరపు రామకృష్ణప్రభు, మ్యాజిక్‌బస్ ఇండియా ప్రతినిధి సీహెచ్ మోహన్ పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా సన్నద్ధమైతే టీచర్ పోస్టు గ్యారంటీ

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం కావడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టవచ్చని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. బ్రాడీపేటలోని కాంపిటీషన్ సక్సెస్ కళాశాలలో గురువారం డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. లక్ష్మణరావు ఎడ్యుకేషనల్ సైకాలజీ పుస్తకాలను ఆవిష్కరించారు. సిలబస్‌ను పూర్తిగా అధ్యయనం చేసుకుని, పాత ప్రశ్నపత్రాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలన్నారు. పాయింట్స్ వారిగా నోట్స్‌ను ప్రిపేర్ చేసుకుంటూ మెథడాలజీ కోసం తెలుగు అకాడమీ పుస్తకాలను చదవాలని సూచించారు. సభకు అధ్యక్షత వహించిన కాంపిటీషన్ సక్సెస్ కళాశాల డైరెక్టర్ టీఎస్ రామన్ మాట్లాడుతూ నాలుగున్నర దశాబ్దాలుగా డీఎస్సీ పరీక్షల ద్వారా వందలాది మందిని ఉద్యోగార్థులుగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. ప్రతి సబ్జెక్టుకు నిష్ణాతులైన సీనియర్ అధ్యాపకులచే చక్కటి ప్రణాళికతో సిలబస్ అందిస్తున్నామని, శిక్షణ పొందే ప్రతి ఒక్కరూ ఉద్యోగ అర్హత పొందాలని ఆశిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు కోటేశ్వరరావు, నవీన్‌కుమార్, వెంకట్, కుసుమకుమార్, ఫణికుమార్, బాలకృష్ణ, శ్రీనివాస్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

లాడ్జికి అనధికారికంగా డ్రెయినేజీ కనెక్షన్

- తొలగించేందుకు వెళ్లిన ఇంజినీరింగ్ సిబ్బంది
- దురుసుగా ప్రవర్తించిన లాడ్జి నిర్వాహకులు
- పోలీసుల సాయంతో కనెక్షన్ తొలగింపు



జిన్నాటవర్ సెంటర్, శీలం వారి వీధిలో లాడ్జి



పోలీస్ అధికారి సమక్షంలో డ్రైయినేజీ కనెక్షన్‌ను తొలగిస్తున్న ఇంజినీరింగ్ అధికారులు

నెహ్రూనగర్: తూర్పు నియోజకవర్గ పరిధిలోని జిన్నాటవర్ సెంటర్, శీలం వారి వీధిలో ఓ లాడ్జి నిర్వాహకులు అనధికారికంగా డ్రెయినేజీ కనెక్షన్ ఇచ్చుకున్నారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో దానిని తొలగించేందుకు ఇంజినీరింగ్ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. కనెక్షన్ తొలగించే సమయంలో సిబ్బందిపై లాడ్జి నిర్వాహకులు దురుసుగా ప్రవర్తించారు. ఇంజినీరింగ్ అధికారులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సమక్షంలో ఇంజినీరింగ్ అధికారులు కనెక్షన్‌ను తొలగించారు.

గతంలో వాటర్, డ్రెయినేజీ కనెక్షన్‌లు తొలగింపు

లాడ్జి నిర్వాహకులు పన్ను బకాయిలు లక్షల్లో ఉన్నారు. దీంతో నగరపాలక సంస్థ నుంచి వాటర్, డ్రెయినేజీ కనెక్షన్ ఇచ్చే అవకాశం లేదు. దీంతో లాడ్జి నిర్వాహకులు అనధికారికంగా వాటర్, డ్రెయినేజీ కనెక్షన్లు ఇచ్చుకున్నారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో రెండు నెలల కిందట వాటిని తొలగించారు. తిరిగి రాత్రికి రాత్రే అనధికారికంగా డ్రెయినేజీ కనెక్షన్ ఇచ్చుకున్నారు. వెంటనే అక్కడికి వెళ్లిన ఇంజినీరింగ్ అధికారులు కనెక్షన్‌ను పోలీసులు సాయం తీసుకుని తొలగించారు.

రూ.70లక్షలు ఆస్తి పన్ను బకాయి

లాడ్జికి రూ.70లక్షల దాకా ఆస్తి పన్ను బకాయిలు ఉన్నాయి. దీనిని వసూలు చేయడంలో రెవెన్యూ అధికారులు ఎందుకు ఉదాసీనత ప్రదర్శిస్తున్నారో అర్థం కావడంలేదు. గతంలో పన్ను బకాయిలు ఉన్న ఆస్తులను నగర కమిషనర్ ఆదేశాల మేరకు వారి ఆస్తులను సీజ్ చేసిన సంఘటనలు చాలా ఉన్నాయి. నగర నడిబొడ్డున, కార్పొరేషన్ కార్యాలయానికి కూత వేటు దూరంలో రూ.70లక్షల దాకా పన్ను బకాయిలు ఉంటే రెవెన్యూ అధికారులు ఎందుకు నోరు మెదపడం లేదో అర్థం కావడం లేదు. ఈ బిల్డింగ్ పైన అనధికారికంగా పెంట్ హౌస్ నిర్మించినప్పటికీ పట్టణ ప్రణాళిక అధికారులు కూడా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో కార్పొరేషన్ అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

టెన్త్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న రవీంద్రబాబు, శేషుకుమారి



విద్యార్థినులతో విమలమేరీ, అమలామేరీ జోస్పిన్, ర్యూన్సీ

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చూపిన సెయింట్ లారెల్స్ ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ మేకల రవీంద్రబాబు అభినందించారు. గురువారం ఆర్టీసీ కాలనీలోని పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులు పి.షఫియా 589, డి.సుజాత 587, ఏ.శ్రీహర్ష 587, ఫైజా జమీర్ బేగ్ 585, ఎస్కే ఎస్ ఫాతిమా 581, షేక్ సోనియా 581, కె.జెస్రీ 575, షేక్ ఖైరున్నీసా 575, వి.భానుసాకేత్ 570 మార్కులు సాధించి, పాఠశాలకు గర్వకారణంగా నిలిచారని తెలిపారు. దశాబ్దాలుగా వెనుకబడిన ప్రాంతంలో సాధారణ విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చి దిద్దుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శేషుకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జైన్ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఎండీ మున్ను

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చూపిన జైన్ హైస్కూల్ విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ ఎండీ మున్ను, ప్రిన్సిపాల్ పి.కనకదుర్గ అభినందించారు. గురువారం సంగడిగుంటలోని పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎండీ మున్ను మాట్లాడుతూ టెన్త్ ఫలితాల్లో తమ విద్యార్థులు అద్భుతమైన ప్రగతి సాధించారని తెలిపారు. గుంటూరు వెంకట కావ్య 574, మొహమ్మద్ జొహర సూఫ్రత్ 574, షేక్ సోఫియా ముస్కాన్ 571, షేక్ ఫైజాన్ 571, కుర్రా నాగ వెంకట జస్వంత్ 568, గూడె శ్రీజ 565, షేక్ సోహెల్ 557 వంటి అత్యధిక సంఖ్యలో 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. అతి సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు సాధించి గుంటూరు నగరానికి తలమానికంగా నిలిచామని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ స్కూల్...

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ చూపిన సెయింట్ ఆన్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థినులను పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జి.విమలమేరీ, కరస్పాండెంట్ సిస్టర్ అమలామేరీ జోస్పిన్, సిస్టర్ ర్యూన్సీ అభినందించారు. గురువారం భారత్‌పేట 7వ లైనులోని పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఎం.హన్నాగ్లోరీ 590, డి.ఏంజిల్ స్వీటీ 589, ఎస్.దీక్షిత 587, కె.బ్లెస్సీ 584, డి.తారకేశ్వర్, డి.గాయత్రి 581 మార్కులు సాధించినట్లు తెలిపారు. పాఠశాలలో 99 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశ్వజ్యోతి పబ్లిక్ స్కూల్...

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో సంగడిగుంటలోని విశ్వజ్యోతి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపినట్లు పాఠశాల డైరెక్టర్ బి.జేమ్స్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బత్తుల వెంకట కీర్తి 592 మార్కులతోపాటు పొగడదండ రేణుక 590, నార్నెడిమిల్లి దుర్గాప్రసన్న 588 సాధించారని తెలిపారు. 550కు పైగా 15 మంది, 500కు పైగా 18 మంది విద్యార్థులు సాధించారని, పాఠశాలలో నూరు శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు వివరించారు.

భారత్‌పేట పాఠశాలలో...



విద్యార్థులతో ఎంఈవో అబ్దుల్ ఖుద్దూస్, ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చూపిన భారత్‌పేటలోని నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాల విద్యార్థులను తూర్పు ఎంఈవో–1 అబ్దుల్ ఖుద్దూస్ అభినందించారు. గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల నుంచి పరీక్షలు రాసిన 35 మంది విద్యార్థుల్లో 12 మందికి 500కు పైగా మార్కులు వచ్చాయని అన్నారు. వి.రోహిత్ 578, కేఎస్‌వీ దుర్గాసాయి 568, యు.సాయి స్వరూప్ 563, పి.మయూరి 561, డి.కీర్తి 556, బి.హర్షిత 549, ఎం.ఆనందలహరి 547, వి.మాధురి 546, ఆర్.శ్రీకృష్ణసాయి 546, కె.భవిక షారోన్ 533, ఎస్.సూర్యతేజ 514, డి. హర్షవర్ధన్ 503 మార్కులు సాధించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం జె.సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.